ఇంకిన పాతాళ గంగ

మొదటిపేజీ తరువాయి...

చెరువులు, కాలువల ద్వారానే 30 శాతానికి పైగా భూగర్భజలాల వృద్ధి చెందుతాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా చెరువులను, చెక్‌డ్యామ్‌లను నింపడం వల్ల మండు వేసవిలోనూ భూగర్భ జల మట్టం పడిపోలేదు. ప్రస్తుతం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొన్నది. ఈ ఏడాది ప్రాజెక్టుల ద్వారా ఆశించిన స్థాయిలో నీటిని విడుదల చేయకపోవడం, గతంలో లాగా చెరువులను క్రమంగా నింపకపోవడంతో భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతున్నట్టు తెలుస్తున్నది. ఈ దశలో రైతులు బోరు బావులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. దీంతో భూగర్భజల మట్టాలు వేగంగా తరిగిపోతున్నాయని భూగర్భజల శాఖ నివేదికే తేటతెల్లం చేసింది.

కృష్ణా బేసిన్‌లో మరింత దారుణం

రాష్ట్రంలోని కృష్ణా బేసిన్ పరిధిలో ఈ ఏడాది ప్రాజెక్టులన్నీ పొంగిపొర్లినా భూగర్భజలాలు మాత్రం పడిపోతున్నాయి. ఇప్పటికే శ్రీశైలం, సాగర్‌తోపాటు వివిధ ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి చేరువలో ఉన్నాయి. కాలువల ద్వారా ఆశించిన స్థాయిలో నీటి విడుదల లేకుండా పోయింది. అయినా రైతులు బోరుబావులపైనే ఆధారపడి యాసంగి పంటలను వేశారు. దీంతో భూగర్భజలాలు త్వరితగతిన అడుగంటుతున్నాయి. సమృద్ధిగా వర్షాలు కురిసిన కృష్ణా బేసిన్ పరిధిలోని జిల్లాల్లోనే భూగర్భజల మట్టాలు వేగంగా పడిపోతున్నాయి. అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 1.17 మీటర్లు, నల్లగొండలో 0.94, వికారాబాద్ 1.38, మహబూబ్‌నగర్ 1.36, రంగారెడ్డి 1.09, నారాయణపేట 1.57, సూర్యాపేట 0.59, యాదాద్రి భువనగిరి 0,95 మీటర్ల చొప్పున లోతుకు భూగర్భజలాలు పడిపోవడం ఆయా జిల్లాల్లో పరిస్థితికి అద్దంపడుతున్నది.

గోదావరి బేసిన్‌లోనూ అంతంతే..

సమృద్ధిగా వర్షాలు కురిసినా, ఆశించిన స్థాయిలో వరద వచ్చినా కూడా గోదావరి బేసిన్‌లోనూ నిరుడితో పోల్చితే వివిధ జిల్లాల్లో భూగర్భజలాలు గణనీయంగా పడిపోతున్నాయి. 2019లో కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి గోదావరి జలాలను పరిపూర్ణంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. ఆ ప్రాజెక్టుతో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, నిజాంసాగర్, సింగూరు, ఎగువ మానేరు, దిగువ మానేరు, కడెం, వరదకాలువ తదితర ప్రాజెక్టులను అనుసంధానించి, అవసరం మేరకు ఎప్పటికప్పుడు జలాలను ఎత్తిపోసి, తద్వారా ఆయా ప్రాజెక్టుల కింద ఉన్న చెరువులను క్రమం తప్పకుండా నీటితో నింపారు. కానీ మేడిగడ్డ డ్యామేజీ పేరిట ప్రభుత్వం ఈ ఏడాది ఆ పని చేయడం లేదు. చెరువులను, చెక్‌డ్యామ్‌లను నింపడం లేదు. ఫలితంగా బేసిన్‌లోనూ భూగర్భజలాలు గతనెలతో పోల్చితే త్వరితగతిన అడుగంటుతున్నాయి. అందుకు భూగర్భజలశాఖ నివేదికనే తెలుపుతున్నది. గోదావరి బేసిన్‌లోని మిగిలిన అన్నిజిల్లాలో ఈ ఏడాది భూగర్భజలాలు లోతుకు పడిపోవడం గమనార్హం.

2023లో మే గడిచినా.. తగ్గని జలాలు

2023లో మే నెల గడచినా భూగర్భజలాలు తగ్గలేదు. ఆ ఏడాది మే నెలలో 20 జిల్లాలో 0.03-2.39 మీటర్ల మేరకు భూగర్భజలాలు పెరిగాయని, అత్యల్పంగా మంచిర్యాలలో, అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో జలమట్టం పెరిగింది. కేవలం 13 జిల్లాల్లోనే స్వల్పంగా భూగర్భజలం తగ్గింది. మొత్తంగా 33 జిల్లాలకు 24 జిల్లాల్లో 5-10 మీటర్ల లోతులో, 8 జిల్లాల్లో 10-15 మీటర్ల లోతులో, ఒక జిల్లాలో 15 మీటర్లకు పైలోతులో భూగర్భజలాలు అందుబాటులో ఉన్నట్టు భూగర్భ జల శాఖ నివేదిక వెల్లడించింది.

30 లక్షల బోర్లు ప్రశ్నార్థకం

చెరువులు, కాలువలు, ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌ల్లో నీటి నిల్వలు లేక ఎక్కడికక్కడ బోర్ల ద్వారా 24 గంటలపాటు నీటిని తోడివేస్తున్నారు. ఫలితంగా రాష్ట్రంలో గతంలో కంటే వేగవంతంగా భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయి. జలరంగ నిపుణులు సైతం ఇదే విషయాన్ని వెల్లడించారు. ఈ దశలో నిన్నమొన్నటి వరకు నిండుగా పోసిన బోరుబావులు ఇప్పుడు మొరాయిస్తున్నాయి. పదుల సంఖ్యలో, వందల అడుగుల్లో బోర్లు వేయడం, నీటి ఊట లేక పడకపోవడం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితుల్లో అరెకరం, ఎకరా సాగు చేయడమే గగనంగా మారింది. గత ప్రభుత్వం క్రమంగా చెరువులను నింపడం ద్వారా 30 లక్షల బోర్ల కింద దాదాపు 45 లక్షల ఎకరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగునీరు అందింది. కానీ ప్రస్తుతం అదే ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. అందులో సగం కూడా పంటలు పండని పరిస్థితి నెలకొన్నది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. కొందరు కొత్తగా బోర్లను వేయిస్తుండగా, మరికొందరు ఉన్న బోర్లను మరింత లోతుకు దించుతున్నారు. అయినా ఫలితం కానరావడం లేదు.

జిల్లాల వారీగా ప్రస్తుతం భూగర్భ జలమట్టం

జిల్లా	2023 (ఫిబ్రవరి)	2025 (జనవరి)	2025 (ఫిబ్రవరి)
ఆదిలాబాద్	6.70	7.06	8.54
భద్రాద్రికొత్తగూడెం	7.68	8.55	9.45
భూపాలపల్లి	7.26	8.38	9.10
హన్మకొండ	4.48	5.93	6.30
హైదరాబాద్	6.86	7.29	8.40
జగిత్యాల	4.19	4.55	4.86
జనగాం	5.57	7.26	8.01
జోగులాంబ	5.55	4.97	6.10
కామారెడ్డి	8.84	10.68	12.97
కరీంనగర్	6.21	7.01	7.63
ఖమ్మం	4.46	3.41	4.99
కుమ్రంభీం	6.44	7.26	7.35
మహబూబాబాద్	4.22	5.17	5.82
మహబూబ్‌నగర్	5.76	7.85	9.12
మంచిర్యాల	4.90	5.95	6.63
మెదక్	10.46	10.89	13.25
మేడ్చల్	7.60	11.21	13.32
నాగర్‌కర్నూల్	5.07	6.39	7.56
నల్గొండ	5.27	6.82	7.76
నారాయణపేట	5.02	6.03	7.60
నిర్మల్	6.50	7.63	9.07
నిజామాబాద్	8.91	10.09	11.94
రంగారెడ్డి	6.91	10.13	2.93
సంగారెడ్డి	9.75	10.27	12.80
సిద్దిపేట	7.28	10.60	12.14
రాజన్నసిరిసిల	6.43	5.38	9.28
సూర్యాపేట	4.49	5.38	5.97
వికారాబాద్	8.72	12.29	13.87
వనపర్తి	3.67	4.48	5.07
వరంగల్	4.01	4.82	5.66
యాదాద్రి	4.91	10.00	10.95
పెద్దపల్లి	4.91	4.95	5.44
సగటు	6.22మీటర్లు	7.46మీటర్లు	8.68మీటర్లు

నివేదిక వివరాలు
భూగర్భ జలాల పెరుగుదల%

వర్షపాతం	35%
కాలువలు	04%
ప్రాజెక్టులు	31%
బోరుబావులు	13%
చెరువులు, కుంటలు	07%
చెక్‌డ్యామ్‌లు, ఇతర నిర్మాణాలు	10%
ఇతర పద్ధతుల్లో	0.2%

భూగర్భ జల వినియోగం

వ్యవసాయం	90%
పరిశ్రమలు	4%
గృహావసరాలు	6%

ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ ఏరియాలో నిర్మించిన మురుమూరు ఎత్తిపోతల పథకం

నెరవేరనున్న కేసీఆర్ జలసంకల్పం

- ప్రారంభానికి సిద్ధమైన మురుమూరు ఎత్తిపోతల
- బీఆర్ఎస్ హయాంలో 90 కోట్లతో నిర్మాణం
- మురుమూర్, వేంనూర్ వద్ద రెండు పంప్‌హౌస్‌లు
- నాడే 95% పూర్తి.. ఎన్నికల కోడ్‌తో ఆగిన పనులు
- 3 రోజులుగా ట్రయల్ రన్.. త్వరలోనే ప్రారంభం
- ఎండాకాలం పంటకు ఆధారం కానున్న ఎత్తిపోతలు
- అంతర్గాం, పాలకుర్తి మండలాల రైతుల్లో ఆనందం

పెద్దపల్లి, మార్చి 5(నమస్తే తెలంగాణ): ఎల్లంపల్లి ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జలసంకల్పం త్వరలోనే నెరవేరనున్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టుతో ఆ ప్రాంత ప్రజలు సర్వస్వం కోల్పోయారు. ఆ ప్రాజెక్టు ప్రాంతంలోని రైతాంగానికి చుక్క సాగునీరు దక్కని పరిస్థితి నెలకొన్నది. ఆ ప్రాంత భూములను సస్యశ్యామలం చేసేందుకు నాడు కేసీఆర్ మురుమూరు ఎత్తిపోతల పథకం చేపట్టారు. 2018లో రూ.90 కోట్ల వ్యయంతో మురుమూరు ఎత్తిపోతల పథకానికి ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారు. పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గ పరిధిలోని పాలకుర్తి, అంతర్గాం మండలాల్లోని 13,396 ఎకరాలకు సాగునీరు, ఆయా ప్రాంతాల్లో తాగునీరు అందించాలని సంకల్పించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయం వరకూ ప్రాజెక్టు పనులు 90 శాతం వరకు పూర్తవగా, ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయాయి. ప్రస్తుత ఆ పనులు పూర్తయ్యాయి. మూడురోజులుగా ఎత్తిపోతల ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఈ వేసవి నుంచే సాగు నీటి అవసరాలను తీర్చేందుకు చర్యలు చేపట్టనున్నారు. త్వరలోనే ఈ ఎత్తిపోతల పథకాన్ని సాగుకు అంకితం చేయనుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. జలస్వాప్నికుడు కేసీఆర్ దూరదృష్టితోనే తమ ప్రాంతం సస్యశ్యామలం కాబోతున్నదని ఆ ప్రాంత అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

13,396 ఎకరాలకు సాగునీరు

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రెండు లిఫ్టుల ద్వారా అంతర్గాం, పాలకుర్తి, పెద్దపల్లి మండలాలకు నీరందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. పథకంలో భాగంగా ఎల్లంపల్లి ప్రాజెక్టుపై మురుమూర్ వద్ద ఒక పంప్‌హౌస్, వేంనూర్ గ్రామం వద్ద ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ వద్ద మరో పంపుహౌస్ నిర్మించారు. మురుమూర్ పంపు నుంచి అకేనపల్లి వద్ద శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎల్-17 కెనాల్‌లోకి నీటిని విడుదల చేసి, బ్రాహ్మణపల్లి, అకేనపల్లి, పొట్యాల, మద్దిర్యాల, ఎగ్లాస్‌పూర్, విస్సంపేట్ గ్రామాలకు సాగునీటిని సరఫరా చేస్తున్నారు. వేంనూర్ పంపుహౌస్ నుంచి పైపులైన్ ద్వారా ధర్మారం మండలం పైడిచింతలపల్లిలోని బండలవాగు ప్రాజెక్టులోకి నీటిని పంపు చేస్తున్నారు. బండలవాగు ప్రాజెక్టులో నీరు నిండితే కుక్కలగూడూర్ గ్రామంలోని 1,250 ఎకరాలతోపాటు, పుట్నూర్, జయ్యారం, గుడిపల్లి శివారుతోపాటు, ధర్మారం మండలం పైడిచింతలపల్లి గ్రామాలకు సైతం వ్యవసాయ బావుల్లోకి నీరు చేరుతుంది. ఈ రెండు లిఫ్టులతో 13,396 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుండగా, ప్రస్తుతం ధర్మారం మండలం పైడిచింతలపల్లిలో బండలవాగు డెలివరీ సిస్టర్న్‌కు వారం రోజులుగా ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు.

కేసీఆర్ సారే మాటిచ్చిండు

కేసీఆర్ సార్ కల గన్నడు. మాకు నీళ్లిస్త అన్నడు. ఆ కల నేడు నెరవేరబోతున్నది. చానా సంతోషంగా ఉన్నది. నేను కుక్కల గూడూరు సర్పంచ్‌గా ఉన్నప్పుడు ఈ లిఫ్ట్‌కోసం చానా కష్ట పడ్డ. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చాలా సాయంచేసిండు. కేసీఆర్ సార్, చందర్ అన్నల వల్లే ఇయ్యాల ఈ లిఫ్ట్ పూర్తయ్యింది.

– గోంద్ర చంద్రయ్య, మాజీ సర్పంచ్, కుక్కల గూడూరు, అంతర్గాం మండలం

రైతు ఆత్మహత్యాయత్నం
పంట ఎండి పోతున్నదనే బాధతో..

బోధన్ రూరల్, మార్చి 5: నిజాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు నీళ్లు అందక పంట ఎండిపోతుండడంతో మనస్తాపం చెందిన ఓ రైతు బుధవారం ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. నిజామాబాద్ జిల్లా సాలూర మండలం కొప్పర్తి క్యాంప్‌నకు చెందిన మాజీ సర్పంచ్ గురునాథం.. జాడిజమాల్‌పూర్ శివారులో గల ఆరున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని వరి వేశాడు. నిజాంసాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లుండడంతో పంటకు ఢోకా ఉండదని భావించాడు. పొట్ట దశకు వచ్చేసరికి రెండు బోర్లు ఎత్తిపోయాయి. అధికారుల నిర్లక్ష్యంతో నిజాంసాగర్ చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. అప్పు చేసి వరి వేస్తే చేతికందే దశలో పంట ఎండిపోవడంతో గురునాథం తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం పురుగుల మందు డబ్బా తీసుకుని వెళ్తుండడాన్ని గమనించిన తోటి రైతులు మందు డబ్బా లాగేసుకున్నారు. కండ్ల ముందే పంట ఎండిపోతుంటే గుండె తరుక్కుపోతున్నదని రైతులు వాపోయారు. చివరి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలని ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకుంటలేరని, కెనాల్‌కు నీళ్లు విడుదల చేసి 12 రోజులవుతున్నా చివరి దాకా నీళ్లు రావడం లేదని తెలిపారు. రూ.లక్షలు అప్పు చేసి ఆరున్నర ఎకరాల్లో వరి వేస్తే, చేతికొచ్చే సమయంలో నీళ్లుఅందక ఎండిపోతున్నదని గురునాథం కుమారుడు కృష్ణప్రసాద్ తెలిపారు. అధికారులు చివరి ఆయకట్టుకు నీళ్లివ్వాలని కోరారు.

అత్యంత కచ్చితమైన గడియారం అమ్మకానికి

టోక్యో: సమయాన్ని అత్యంత కచ్చితంగా చూపించే గడియారం జపాన్‌లో బుధవారం అమ్మకానికి వచ్చింది. ఇది ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన గడియారం. 'ఏథెర్ క్లాక్ ససీ 020' ఎంత కచ్చితంగా సమయాన్ని చూపిస్తుందంటే, ఒక సెకన్ సమయం అటు ఇటుగా చూపించడానికి 1,000 కోట్ల సంవత్సరాలు పడుతుంది. దీనిని తయారు చేసిన షిమజు కార్పొరేషన్ ఈ వివరాలను వెల్లడించింది. దీనిని స్ట్రోంటియమ్ ఆప్టికల్ లాట్టిస్ క్లాక్ అని పిలుస్తున్నారు. ఇది సీసియమ్ అటామిక్ క్లాక్ కన్నా 100 రెట్లు కచ్చితమైనది. రానున్న మూడేళ్లలో ఇటువంటి 10 గడియారాలను విక్రయించాలని ఈ కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకుంది.

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నాయకపుగూడెంలో ఎండిన పొలంలో బైఠాయించి నిరసన తెలుపుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, రైతులు

ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు నీరేది?

- పంటలు ఎండుతున్నా సర్కార్ స్పందించదా?
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మండిపాటు
- పోతారం, నాయకపు గూడెంలో పర్యటన
- రైతులతో కలిసి పొలంలో కూర్చొని నిరసన

సారంగాపూర్, మార్చి 5: ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు నీరందక రైతులు అల్లాడిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత విమర్శించారు.బుధవారం ఆమె జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పోతారం శివారులోని నాయకపు గూడెంలో పర్యటించారు. స్థానిక రైతులతో కలిసి ఎండిన పంటలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పుష్కలమైన జలాలతో బంగారు పంటలు పండించిన రైతులు, కాంగ్రెస్ పాలనలో నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక్క ఎండిన పంటలను చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని అన్నారు. పోతారంలో హన్మంతరావు కుంటలో నీరులేక ఈ సీజన్‌లో దాదాపు 60 ఎకరాలు బీడు పెట్టుకునే పరిస్థితి రావడం ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమని పేర్కొన్నారు. రేచపల్లి నుంచి కెనాల్ ద్వారా అధిక మోతాదులో నీటిని విడుదల చేస్తే హన్మంతరావు కుంటలోకి నీళ్లు వస్తాయని, కానీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడితే రెండ్రోజుల కిందనే నీటిని వదిలి పెట్టామని చెప్తున్నారని, ఇక్కడికైతే నీళ్లు రాలేదని అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు స్పందించి, గ్రామాల్లో పర్యటించి రైతుల బాధలు తెలుసుకోవాలని సూచించారు. నాయకపు గూడెంలో ఎండిన పొలంలో రైతులు పశువులను మేపుతుండగా, అక్కడికి వెళ్లి వారితో మాట్లాడారు. రైతులతో కలిసి పొలంలోనే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

15 ఏండ్లు గడిచినా పరిహారం ఇవ్వరా?

- కోర్టు ఆదేశాలంటే లెక్కలేదా?
- నలుగురు అధికారులకు నోటీసులు
- 28న వ్యక్తిగతంగా వివరణ ఇవ్వాలన్న హైకోర్టు

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువకు సమాంతరంగా మరో కాలువ తవ్వకం కోసం భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించక పోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రైతుల నుంచి భూమిని తీసుకుని 15 ఏండ్లయినా పరిహారం చెల్లించే తీరిక అధికారులకు లేదా అని మండిపడింది. కోర్టు ఆదేశించిన తర్వాత కూడా రైతులకు పరిహారం చెల్లించకపోవడంలో ఆంతర్యం ఏమిటని నిలదీసింది. పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేయాలని నిరుడు సెప్టెంబర్‌లో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదని, కోర్టు ఉత్తర్వులంటే లెక్కలేదా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులు అమలు చేయకపోవడం కోర్టు ధిక్కరణ కిందికి వస్తుందని పేర్కొన్నది. కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పాలంటూ నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కే రామకృష్ణారావు, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తోపాటు వనపర్తి భూసేకరణ అధికారి డీ సుబ్రమణ్యంకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 28న జరిగే తదుపరి విచారణకు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆ నలుగురు అధికారులను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

టీబీ డ్యాం నుంచి నీటి విడుదల
9 రోజులపాటు 2.6 టీఎంసీలు

అయిజ, మార్చి 5 : ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో యాసంగిలో సాగు చేసిన పంటలకు నీటి లభ్యత తగ్గుతుండటంతో బుధవారం కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు. ఆర్డీఎస్, కేసీ కెనాల్ నీటి వాటా నుంచి 4 వేల క్యూసెక్కులు వదిలారు. 2024-25 ఏడాదికి గానూ కేటాయించిన నీటి వాటా నుంచి చివరి ఇండెంట్‌ను విడుదల చేశారు. 9 రోజులపాటు 2.6 టీఎంసీలు విడుదల చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్‌సీ, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఉత్తర్వుల మేరకు టీబీ బోర్డు కార్యదర్శి నాగమోహన్‌కు ఇండెంట్ పెట్టారు. రోజుకు 4వేల క్యూసెక్కుల చొప్పున ఈ నెల 13 వరకు విడుదల కొనసాగుతుందని ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 9వ తేదీ వరకు ఆర్డీఎస్ నీళ్లు చేరుతాయని పేర్కొన్నారు.



కర్ణాటకలోని టీబీ డ్యాం ద్వారా తుంగభద్ర నదిలోకి చేరుతున్న నీరు

సూర్యాపేట జిల్లా మునగాల మండలం నేలమర్రి గ్రామంలో ఎండిన వరిపైరును పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

రైతులు కన్నీరు పెడుతున్నా కనికరం చూపరా?
కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మునగాల, మార్చి 5: ఎండుతున్న పంటలను చూసి రైతులు కన్నీరు పెడుతుంటే ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందని, సాగునీరు ఇవ్వకుండా రైతుల ఉసురు తీస్తున్నదని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సాగు నీరు అందక సూర్యాపేట జిల్లా మునగాల మండలం నేలమర్రి గ్రామంలో ఎండిన వరి పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లయ్యయాదవ్ మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా రెండు పంటలకు కాళేశ్వరం నీళ్లు ఇవ్వగా, కాంగ్రెస్ పాలనలో నీళ్లు రాక బతుకులు ఆగమవుతున్నాయన్నారు. సాగుకు నీళ్లియ్యకపోతే రహదారి దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.

నటి రన్యారావు ఇంట్లో సోదాలు
4 కోట్ల విలువైన బంగారం, నగదు స్వాధీనం

బెంగళూరు, మార్చి 5: దుబాయ్ నుంచి స్మగ్లింగ్ చేస్తూ 14.5 కేజీల బంగారంతో సోమవారం బెంగళూరు ఎయిర్‌పోర్టులో పట్టుబడ్డ కన్నడ నటి రన్యారావు (31) ఇంటిలో పెద్దయెత్తున బంగారం, నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అరెస్ట్ చేసిన అనంతరం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఎస్) అధికారులు లావెల్లె రోడ్‌లోని ఆమె ఇంటిలో సోదాలు నిర్వహించగా 2.06 కోట్ల విలువైన బంగారు నగలు, 2.67 కోట్ల నగదు పట్టుబడ్డాయి. దీంతో పట్టుబడిన మొత్తం నగదు, బంగారం విలువ 17.29 కోట్లుగా అధికారులు నిర్ధారించారు. కర్ణాటక స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డీజీపీ రామచంద్రరావు సవతి కుమార్తె అయిన రన్యారావు 15 రోజుల్లో నాలుగుసార్లు దుబాయ్ వెళ్లింది. ప్రతిసారీ ఆమె ఒకేరకమైన దుస్తులు ధరించేది. దీనిపై అధికారులు ఆరా తీస్తున్నారు. రన్యారావు ను ఆర్థిక నేరాల న్యాయస్థానంలో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు.

సిద్దిపేటను ఎడారిగా మార్చేందుకు కుట్ర

- నీళ్లులేక పంటలెండుతున్నా పట్టదా?
- రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్న సర్కార్
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ఫైర్
- దమ్మక్కపల్లిలో ఎండిన పొలాల పరిశీలన

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 5 : నీళ్లులేక పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ సర్కార్‌కు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్, హరీశ్‌రావుపై కక్ష గట్టి రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లాను ఏడారిగా మార్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. బుధవారం ఆయన బీఆర్ఎస్ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో మండలంలోని దమ్మక్కపల్లిలో ఎండిపోయిన పంటలతోపాటు నీళ్లు లేని కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. నాడు కేసీఆర్ పాలనలో పచ్చని పొలాలు, గోదావరి జలాలతో చెరువులు, కుంటలు, కాలువలు నిండుకుండలా ఉండేవని అన్నారు. నేడు కాంగ్రెస్ అసమర్థ పాలనలో ఎడారిని తలపిస్తున్నదని ఆరోపించారు. రైతుల బాధలు ఈ ప్రభుత్వానికి పట్టడం లేదని మండిపడ్డారు. సాగునీరు అందక రైతుల పంటలు ఎండిపోతుంటే, కాంగ్రెస్ నాయకులు, సీఎం రేవంత్‌కు చీమ కుట్టినట్టు కూడా లేదని విమర్శించాడు. రైతుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో కాలువకు ఇరువైపులా ఏటా రెండు పంటలకు నీళ్లందాయని, 6వేల ఎకరాల్లో పంట పండేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా కొండపాకకు చుక్క నీరు రాలేదని విమర్శించారు. ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు నింపకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పట్టిపోయాయని మండిపడ్డారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నీళ్లను ఉమ్మడి మెదక్ జిల్లా రైతులకు ఇవ్వకుండా.. మంత్రులు ఉత్తమ్‌కు మార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ జిల్లాకు తరలించుకుపోతున్నారని ఆరోపించారు. మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీళ్లు అందించడానికి టన్నెలు పనులు ప్రారంభిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పనులు ఆగిపోయాయని తెలిపారు.

కొండపాక మండలం దమ్మక్కపల్లిలో నీళ్లు లేని కాలువలను పరిశీలిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

నీళ్లియ్యకుంటే మూకుమ్మడిగా సస్తం

- బక్కేరు వాగులోకి నీళ్లు వదిలితేనే పంటలు చేతికి.. లేకుంటే చావే శరణ్యం
- పురుగుల మందు డబ్బాలతో యాదాద్రి జిల్లా జానకీపురం రైతుల నిరసన

అడ్డగూడూరు, మార్చి 5 : బిక్కేరువాగులోకి నీళ్లు వదిలితేనే పంటలు చేతికి వస్తాయని, లేకుంటే తమకు చావే శరణ్యమని రైతులు ఆందోళనకు దిగారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామంలో బుధవారం పంట పొలాల్లో రైతులు పురుగుల మందు డబ్బాలు పట్టుకొని నిరసన తెలిపారు. గ్రామంలో సుమారు వందమంది రైతులకు చెందిన దాదాపు 200 ఎకరాలు ఎండిపోతున్నదని ఆందోళన చెందారు. బిక్కేరువాగు గుండా 10 రోజుల పాటు నీటిని వదిలితే చెక్‌డ్యామ్‌లు నిండి తమ పంటలు పండుతాయని తెలిపారు. ఇప్పటికే కొన్ని వరి పొలాలు నీళ్లు లేక ఎండగా పశువులకు మేతకు వదిలేశామని, మిగిలినవి పంటలనైనా కాపాడాలని విజ్ఞప్తి చేశార